తీర్థయాత్ర

'హవిస్'

సూర్యోదయం అవుతున్నది.

ఆరోజు కార్తీక పున్నమి. నదీ స్నానమూ, వీలైతే సముద్ర స్నానమూ, ఆరోజు శుభప్రదమూ, మంగళదాయకమూ అయినవి. అందువల్లనే అందరు ప్రజలు ఆ నదీ తీరానికి విచ్చేశారు. సూర్యునిదిక్కు మొగమై, చాతనయిన వాళ్ళు స్వంతంగానూ, తదితరులు పురోహితుల ద్వారానూ మంత్రాలు చదువుతూ, చదివిస్తూ తర్పణాలు వొదులుతున్నారు. పొడిబట్టలు, పట్టు బట్టలు వొడ్డున కూచుని ఉన్న బ్రాహ్మణ కుర్రవాడికి వప్పజెప్పి పంచెలు ఎగదోపి నదిలోకి దిగుతున్నారు పురుషులు. ఆ కుర్రవాడికి అనతిదూరంలో కూచునివున్న పండు ముత్తయిదువుకు, మెడలో నగలూ, వెంట తెచ్చుకున్న బట్టలూ యిచ్చి, చీరె వొంటి చుట్టూ చుట్టుకుని నీళ్ళలోకి దిగుతున్నారు స్త్రీలు. అదంతా గమనిస్తూ రంగనాథం నదిఒడ్డు దగ్గరకు వొచ్చారు. ఆ బ్రాహ్మణ కుర్రవాడు "పట్టు పంచె యిలా యివ్వండి పంతులుగారూ! వెళ్లి స్నానం చెయ్యండి" అన్నాడు చెయ్యిజాపి. రంగనాథం నవ్వి వాడిచేతికి పట్టుపంచె యిచ్చి, కట్టుకున్న పంచె ఎగదోపి నీళ్ళలోకి దిగారు. జందెప్పోగులు సరిజేసుకున్నారు. వొడ్డుకు దగ్గరగా ఉన్న నీటిలో జనం క్రిక్కిరిసి ఉన్నారు. ఆయన నీటినీ, మనుషులనూ చేతుల్తో తొలగించుకొంటూ కాస్త విశ్రాంతిగా ఉన్న ప్రదేశం జేరారు. నడుంలోతు నీళ్ళున్నాయి అక్కడ. "హరహర మహదేవ" అనుకుంటూ వొక్క మునుగు మునిగారు. లేచి వొళ్లంతా చేతుల్తో రుద్దుకుంటూ మనసులో "హరేరామ హరేరామ" అనుకుంటూ అవతలా యువతలా చూశారు. ఆయనకు ఎడం ప్రక్కగా నాలు గయిదు గజాల దూరంలో ఇద్దరు యువకులు స్నానాలు చేస్తున్నారు. ఇద్దరూ సుఫురద్రూపులు. నవ్వుకొంటూ వొకళ్ల మీద వొకళ్ళు నీళ్ళు విసురుకుంటూ స్నానాలు చేస్తున్నారు. ఇంతలో వొకడు రెండవవాడి బుజం చరిచి 'అటు చూడు అటు చూడు" అన్నాడు ఆత్రంగా. ఆ యువకుడు అటు చూశాడు. ఒక అందమయిన పద్దెనిమిదేళ్ల అమ్మాయి నీళ్లల్లోకి దిగుతోంది.

"ఎవరో గుర్తు పట్టావా?" అన్నాడు మొదటివాడు.

"ఉహుఁ" అన్నాడు రెండో అతను.

"రాజారాంగాడి కూతురోయ్! సుభద్ర."

"ఛా!? అయితే ఆ వెంట ఉన్న ముసలామె?"

"హాస్టలు వార్డెను. ఈవిడగారి కేర్ టేకరు."

"అంటే?"

"అంత అమాయకంగా అడుగుతా వేమిటోయ్? ఈమధ్య ఈవిడగారు చాలా పెద్ద గ్రంథం నడిపింది. పాపం బ్రద్దలయేవేళకి గుంటూరు ఆసుపత్రి ఆదుకుంది."

"గుడ్‌గాడ్!"

"నా మాటమీద నమ్మకం లేకపోతే సుందరంగాడ్ని అడుగు" అంటూ నీళ్లలోకి మునిగాడు మొద టతను. రెండో యువకుడు కొన్ని క్షణాలు ఆ యువత వైపే చూసి "ఎవడో గాని .... స్వర్గం అనుభవించి ఉంటాడు" అన్నాడు. ఇద్దరూ పగలబడి నవ్వుకున్నారు.

'శివశివా' అనుకున్నారు రంగనాథం. ఎంత దిగజారిపోయింది నేటి యువత? తీర్థయాత్రకని వొచ్చి యువతుల అంగసౌష్టవాలూ, వాళ్ల తాలూకు దిక్కుమాలిన కబుర్లూ చెప్పుకుంటూ ఎంత నేలబారుగా బతుకుతున్నారు? అసహ్యంతో ఆ యువకుల వంక వొక్కసారి చూసి దూరంగా నడిచారు. సూర్యకిరణాలు లేతగా ప్రసరిస్తున్నాయి. ఆయన మరొక్కసారి మునిగి లేచి వొళ్ళు రుద్దుకోసాగారు. ఆ పరిసరాల్లో ఎక్కడా యువకులు గాని యువతులుగాని లేరు. నలుగు రయిదుగురు నడి వయసు ఆసామీలు "హరేరామ హరేరామ" అంటూ స్నానాలు చేస్తున్నారు. రంగనాథంగారి మనసు కుదుటపడింది. భారం తేరినట్లు నిశ్వసించి జంధ్యాన్ని చేతుల్తో రుద్దుతూ అటూ యిటూ చూశారు. కాస్తంత అవతలగా ఇద్దరు నడి వయసు ఆసామీలు స్నానం చేస్తున్నారు. ఇద్దరూ నల్లగా బలిష్టంగా ఉన్నారు. కేశాలు అక్కడక్కడా నెరిశాయి. వా రిద్దరూ వొకరి కొకరు తెలిసినవారే అయివుండవొచ్చు ననటానికి నిదర్శనంగా అందులో కాస్త పొట్టిగా ఉన్నాయన రెండో ఆయన్ను పలకరించాడు.

'ఏంవయింది మొన్న?" అన్నాడు రెండో ఆయన.

"అయేందుకేవుంది?"

"నాలు గయిదు వందల్దాకా వొదిలిందని విన్నాన్లే."

"తప్పేదేవుంది బాబూ! ఆ పాత పంతులు పోయి ఈ నాయుడు వొచ్చాడు.? మన ప్రాణానికి యములాడిలా తయారయాడు. పంతులులో వొక సుగుణం ఉండేది. నాలుగు వందల బేరానికి యాభయి యిస్తాం అంటే సరేనని వూరుకునేవాడు. అంతేనా? ప్రస్తుతానికి లేదయ్యా తర్వాత సర్దుతా నంటే కూడా చూసీ చూడనట్టు పోయేవాడు. ఈ నాయుడో? యముడు. కాసులు రాల్తేనే గడప దాటలా

నంటాడు. పైగా నాలుగొందలకీ నూట యాభయి కావా లంటాడు ?"

"నూట యాభయ్యే ?"

"అదేగా చెప్పేది. మొన్న జగ్గయ్యపేట సోమరాజు గారి దాంటో ఆరొంద లొచ్చింది. అప్పటికీ ఎవరికీ తెలియకుండా నేనే స్వయంగా సరుకు యిచ్చొచ్చాను. ఎలా తెలుసుకున్నాడో ? ఆరొందలకీ రెండొందలు పారెయ్యమాని కూచున్నాడు."

"ఇచ్చెయ్యలేకపోయావా ?"

"ఇది మరీ బావుంది. ఈయ నొక్కడేనా ఏమిటి మనకి సిష్టాది గురువు ? అవతల రెడ్డెమ్మ కొంత గుంజుతాడయ్యే ! గుమాస్తాలకీ వాళ్లకీ పండగ మామూళ్లు తగలెయ్యాలయ్యే. అయన్నీ అందులోనే రావాలంటావా. ఎక్కడనుంచయినా ఎత్తుకొస్తావాః ?"

"ఇయ్యకపోతే .... ఎంత రబస అయిందో అనుభవించావుగా ?"

"అదీ నిజమేలే ! అయినా ప్రాణం పీకుతుంది చూడు."

"అసలు గలాటా ఎలా అయింది ?"

"మామూలే ! రామచంద్రపురం శర్మగారు వంద తులాలు పంపాడు. అది మా యింట్లో సందుగు పెట్టెలో పెట్టాను. ఆ సంగతి పసిగట్టాడు నాయుడు. "నాలుగువంద లిస్తావా ? రిపోర్టు రాయించనా ?" అన్నాడు. ఇచ్చాను."

"బావుంది !"

"నువ్వు అదుష్టమంతుడివయ్యా ! నీ కీ బాధలు లేవు."

"ఏమదుష్టంలే .... కానీ ! వొక్క మునుగు మునుగు."

ఇద్దరూ ఒక్కసారిగా నీళ్లల్లో మునిగారు. రంగనాథం జుగుప్సగా అవతలికి నడిచారు. దొంగ వ్యాపారం చేస్తూ దాని బేరీజులు ఇక్కడా వేసుకునేది ? మనిషి ఎంత అధఃపతితుడై పోయాడు ? పాపవిసర్జనానికి, పుణ్య సంపాదనకు పెద్దలు తీర్థయాత్రలు ఏర్పాటు చేశారు. స్వర్గానికి పోయినా సవతి పోరు తప్పలే దన్నట్లు ఇక్కడి కొచ్చినా ఇదే గొడవా ? బుర్రలోంచి ఆలోచన తొలగించడానికి ఆయన గట్టిగా నాలు గయిదు సార్లు "హరేరామ హరేరామ" అనుకున్నారు. సూర్య కిరణాలు కాస్త ముదురుబారాయి. రంగనాథం సంధ్యావందన మంత్రాలు పఠిస్తూ ఆచమానం చేశారు. కాస్త అవతలగానే మరో యిద్దరు ఆసామీలు కూడా అదేపని చేస్తున్నారు. ఇద్దరూ 'క్రాస్‌బెల్టు' గాళ్లు. రంగనాథం గారికి వొక్క క్షణంపా టు వారూ ఏదయినా పాపిష్టి సంభాషణ ప్రారంభిస్తారేమోనన్న భయం కలిగింది. కాని వారు అదేం చెయ్యక సంధ్యావందనంలో నిమగ్నులు కావడంతో కుదుటపడి తమ కార్యక్రమం కొనసాగించారు. పావుగంట సేపటికి సంధ్యావందనం పూర్తయింది. రంగనాథం వెంట తెచ్చుకున్న చెంబులో నీళ్లు పట్టుకొని మరొక్కసారి సూర్యుడికి నమస్కరించి వొడ్డుకేసి బయలుదేరారు. అప్పటికే సంధ్యావందనం పూర్తిచేసిన ఆ యిద్దరు ఆసామీలు కూడా వొడ్డుకు బయలుదేరుతూ ఆయన్ను చూసి "పొరుగూరువారా పంతులు గారూ ?" అంటూ ఆయన పక్కన నడవసాగారు.

"అవునండి ! తాడేపల్లి గ్రామం" అన్నారు రంగనాథం.

"కరిణీకమా ?"

"కాదు బాబూ ! అక్కడ మాకు కొద్దిగా పొలా లున్నాయి. వాటిమీద అజమాయిషీ చేస్తూ అక్కడే ఉన్నాను."

"మంచిపని చేస్తున్నారు. ఈ రోజుల్లో కౌలుదార్ల భరోసా మీద పొలాలు విడిచిపెట్టినంత బుద్ధితక్కువ లేదు."

"నిజమే గానీండి. వ్యవసాయంలో కూడా చాలా కష్టనష్టా లున్నాయి. అందులో ఈమధ్య వర్షాలు సరిలేక పంటచేలు దెబ్బతింటున్నాయా ? కాస్త పచ్చగా ఎవడయినా కనబడితే వాడి వెంట ఈ సన్నకారు రైతులంతా వేటకుక్కల్లా పడుతున్నారు. అప్పులు ! అప్పులు ! అని. ఇస్తే తీర్చేనాథుడుండడు."

"ఏమయినా పట్నవాసులకన్నా మీరే నయం. మా గతులు చూడండి. ఇతను నా బావమరిది. పెళ్లీడుకి దిగిన కూతురుంది. సలక్షణంగా ఉంటుంది. సంబంధాలు దొరకవు. ప్రతి నస్మరంతిగాడికీ వేలకువేలు కట్నాలు కావాలి. ఎక్కడ్నుంచి తెస్తాం చెప్పండి ?"

"అయితే పల్లెటూరి వారికి కట్నాల బాధ లుండ వంటారా ?"

"అదికాదు. మీరు నాలుగు రాళ్లు వెనకేసుకో గలుగుతారు గనక మా అంత ఇబ్బంది పడవలసిన అవసరం ఉండదు మీకు."

"అదేంకాదు లెండి ! అంతా వొక రకంగానే ఉన్నాం."

ముగ్గురూ బ్రాహ్మణ కుర్రవాడి దగ్గర్నుంచి పంచెలు తీసుకుని తడివి తీసి అవి కట్టుకున్నారు. తడి పంచె పిండి బుజాన వేసుకున్నాక రంగనాథంగారు నీళ్లచెంబు లోంచి రెండణా కాసులు తీసి ఆ కుర్రవాడి కిచ్చారు. అతనవి తీసుకుని పక్కనే ఉన్న పళ్లెంలో వేశాడు. మిగతావా రిద్దరూ చెరో అణా యిచ్చారు. రంగనాథం వారు వొస్తున్నారు కదా అనే తలంపుతో ముందుకు సాగారు. కొంతదూరం పోయాక వెనుదిరిగి చూస్తే వారు కనపడలేదు. రంగనాథం ఓ క్షణం పాటు వారెక్కడన్నా కనపడతారేమో నని చూసి, కనపడకపోగా ముందుకు సాగారు.

నది వొడ్డునుంచి రెండు ఫర్లాంగులు నడిస్తే దేవాలయం వొస్తుంది. ఆ దారంతా బిచ్చగాళ్లు, రకరకాల వాళ్లు—గుడ్డలు పరుచుకుని యాత్రీకుల్ని దీనంగా అర్థిస్తున్నారు. అందులో కొందరు బలిష్టులూ, దృఢకాయులూ కూడా ఉన్నారు. అందరికీ ధర్మం చేసుకుంటూ వొస్తున్న ఆసామీలు అవిటివాళ్లతోపాటు వాళ్లకీ ధర్మంచేసి "దుండు ముక్కల్లా ఉన్నారు. పనీ పాటా చేసుకోలేరూ ?" అనుకుంటూ కదలిపోతున్నారు. కొందరు పెద్దమనుషులు బిచ్చగాళ్లు కూచున్న చోటుకి వెనగ్గా ఉన్న పిట్టగోడ మీదికి ఎక్కి

పళ్ళు తోముకుంటూ వొచ్చే పోయే స్త్రీలమీద 'కామెంట్స్' విసురుతున్నారు. రంగనాథం 'హరేరామ హరేరామ' అనుకుంటూ బిచ్చగాళ్ళకి పైసలు వేస్తూ ఆలయం మెట్లదాకా వొచ్చారు. అక్కడ దాదాపు ఇరవైదాకా పెట్టె దుకాణాలు ఉన్నాయి. అందరూ 'రండి బాబూ' అని గోలగా అరుస్తున్నారు యాత్రికుల్ని. రంగనాథం ఒకక్షణం నిలువబడి అన్ని కొట్లవంకా చూశారు. చివరగా ఉన్న ఒక కొట్లో పదకొండు పన్నెండేళ్ల అమ్మాయి కూచుని కొబ్బరికాయలు అవీ అడిగినవారికి యిస్తున్నది. రంగనాథం ఆ కొట్టువైపు నడిచారు. ఆపిల్ల ఆయన్ని చూడంగానే "ఏం కావాలి బాబూ?' అన్నది వినయంగా. రంగనాథం కావల్సినవి చెప్పారు. ఆపిల్ల అవన్నీ వో బుట్టలో పెట్టి ఆయన చేతికిచ్చి "వెళ్ళేటప్పుడు బుట్ట యిచ్చేసి పొండి బాబూ" అన్నది. రంగనాథం తల వూపి బుట్ట చేత్తో పట్టుకుని ఆలయం మెట్లెక్కసాగారు. ఆలయం కొండమీది వుంది. సోపానాలు కూడా చాలా ఉన్నాయి. అన్నింటిమీద ఇరు వయిపులా బిచ్చగాళ్ళు కూచుని 'ధర్మం బాబూ' అని అరుస్తున్నారు. మెట్ల కవతలగా కొండ భాగంలో నాలుగయిదు పూరిళ్లున్నాయి. వొక ఇంటిముందు వొక వృద్ధురాలు కూచుని బియ్యంలో రాళ్ళు ఏరుతూ "రాముని చరితము" అంటూ కూని రాగాలు తీస్తోంది. కాస్తంత అవతలగా వో మేక కట్టేసి ఉంది. రంగనాథం అంతా గమనిస్తూ భగవధ్యానం చేసుకుంటూ కొండ ఎక్కారు. ఆలయం కోనేటిలో పాదాలు కడుక్కుని ప్రదక్షిణం చేసి దర్శనార్థుల 'క్యూ' లో నిలబడ్డారు. క్యూ చాలా పొడుగ్గానే ఉంది. ఎండ బాగా పైకి వచ్చింది. యాత్రీకుల మీదికి ఎండ రాకుండా ఆలయ ప్రాంగణంలో విశాలంగా పెరిగిన రావి వృక్షం అడ్డుపడుతున్నది. అయినా ఎలాగో దారి చూసుకు వొచ్చిన కిరణాలు చుక్కల్లా, నక్షత్రాల్లా నేలమీద మెరుస్తున్నాయి.

ఆ ఆలయం కట్టి చాల కాలమే అయింది. అయినా చాలా ఆదాయం ఉండటంచేత ప్రాంగణమంతా శోభాయమానంగా నిర్మింపజేశారు. ఆలయ కుడ్యాలమీద చిత్రితమయిన దైవ స్వరూపాలు యాత్రికుల్ని భగవధ్యాన తత్పరుల్ని చేస్తున్నాయి. నేల అంతా తెల్లటి రాళ్ళు పరిచి పరిశుభ్రం చేయటానికి అనువుగా చేశారు. ధ్వజస్తంభం పచ్చగా 'తళతళ' మెరుస్తున్నది. లోపలకు వెళ్ళే తోవలో గర్భాలయం ప్రాంగణం వరకు మధ్యగా 'దడి' కట్టారు. ఎడమవైపు పురుషులూ, కుడివైపు స్త్రీలూ 'క్యూ' లో నిలబడి అమ్మవారి దర్శనం చేసుకుంటున్నారు. గంటలు ఎడతెరపి లేకుండా మోగుతున్నాయి. ధ్వజస్తంభానికి ఇవతలగా ఉన్న డిబ్బెంలో కానుకలు వేసి 'క్యూ'తో పాటు ముందుకు కదిలారు రంగనాథం. ముందు యింకా పదిమంది దాకా ఉన్నారు. వారి తలలపై నుంచి అమ్మవారి ముఖము కొద్దిగా కనుపిస్తున్నది. కళ్ళు మూసుకుని నమస్కారం చేసి ఎవరో తోసినట్లు కాగా కళ్ళు తెరిచారు. వెనుక నిల్చున్న యువకుడు "కుమించండి! అనుకోకుండా తగిలింది" అన్నాడు. రంగనాథం "ఫరవాలేదు లెండి" అని ముందుకు తిరిగారు. మొదట్లో ఉన్న వ్యక్తి శఠగోపం పుచ్చుకొని ప్రసాదం తీసుకుని బయటకు వెళ్ళుతున్నాడు.

అతన్ని చూసి తుళ్లిపడ్డారు రంగనాథం.

ఆ క్షణాన అతని కోసం తాను ఎంత వెదికిందీ గుర్తుకొచ్చింది రంగనాథంగారికి. అతని పేరు రాజయ్య సుమారు ఆరు నెలల కిందటిదాకా తాడేపల్లిలోనే ఉండేవాడు అతను. సన్నకారు రైతు. భార్య, ఇద్దరు పిల్లలూ ఉన్నారు. కష్టపడి వాళ్లని పోషిస్తున్నాడనీ, నీతిమంతుడని, అతనంటే రంగనాథంగారికి ఎంతో ఆపేక్ష ఉండేది. అతనూ రంగనాథంగారంటే ఎంతో గౌరవంతో విధేయతతో ఉండేవాడు. అలాంటివాడు ఉన్నట్లుండి చెప్పా పెట్టాకుండా పెళ్ళాం బిడ్డల్తో ఆ వూర్నించి మకాం ఎత్తేశాడు. ఆ సంఘటన జరిగిన మర్నాటినుంచీ అతన్ని గురించి రకరకాల మాటలు బయలుదేరాయి. వాటి సారాంశం అతడొక పెద్ద మోసగాడని. అతడు కవులు చేస్తున్న పొలం ఖామందు ప్రసాదరావుగారికి అతడు దాదాపు నాలుగు వేల రూపాయలు బాకీ అట. ఆ మాట వినంగానే రంగనాథంగారి గుండె గుభేలుమన్నది. విత్తనాలకీ వాటికీ డబ్బు లేదనీ, క్రితం ఏడాది పంటలు బాగా పోవటాన రోజు గడవటమే కష్టంగా ఉందనీ మొరపెట్టుకుంటే రూపాయి పావలా వడ్డీకి ఆయన అతడికి మూడు వందల రూపాయలు అప్పు యిచ్చారు. అతడు పారిపోయాడని తెలియడంతో అంత డబ్బుకీ తిలోదకాలేనని ఆయన ఎంతగానో బాధపడ్డారు. అవును మరి! దమ్మిడీ దమ్మిడీ కూడబెట్టుకొని సంపాదించుకున్న డబ్బు! పుణ్యానికి పోతే పాపం ఎదురయిందని సహాయం చేయబోతే మోసం జరిగింది. ఆ తరువాత అతన్నిగురించి చాలా వాకబు చేశారు రంగనాథం. ఎక్కడా జాడ దొరకలేదు. అన్నాళ్ళకి యిప్పుడు యిక్కడ దర్శన మిచ్చాడు. "త్రాష్టపు వెధవ లందరికీ దేవుఁ డొకడు దొరికాడు. దగుల్బాజీ పనులు చేసేదీని, గుళ్ళో కొచ్చి దణ్ణాలు పెట్టేదని" అనుకున్నా రాయన కసిగా. ఆ కసిలోనే ఆయనకు పట్టుదల కూడా కలిగింది. ఈ వేళ ఏమయినా సరే వాడి అంతు తేల్చాలి. వాటం చూస్తే నాలుగు రాళ్ళు సంపాదించినట్లుగానే ఉన్నాడు. నాలుగూ జాడిస్తే వడ్డీ లేకపోతే మానె అసలయినా రాలకపోదు.

అలా అనుకుంటూ 'క్యూ'తో పాటు ముందుకు వొచ్చారు. రంగనాథం. కొబ్బరికాయలూ, పూలూ, పళ్ళూ ఉన్న బుట్ట పూజారి చేతికిచ్చి "తొందరగా కానియ్యి బాబూ" అన్నా రాయన. ఆలస్య మయితే మళ్ళీ ఆ దౌర్భాగ్యుడు చేయి జారి పోతాడు. పూజారి కొబ్బరికాయలు కొట్టి హారతి పళ్లెం ఆయన ముందు ఉంచాడు. దక్షిణ వేసి కుంకం నొసట పెట్టుకొని బుట్ట అందుకున్నారు రంగనాథం. పూజారి ఆయన కదలబోతూండగా అన్నమాట ఆయన చెవిని పడలేదు. వడివడిగా బయటకు వొచ్చి నాలుగు వైపులా వెదికారు. రావిచెట్టు అవతల ఉన్న అరుగుమీద అప్పటిదాకా కూచుని ఉన్న రాజయ్య లేచి వెళ్ళబోతున్నాడు. ఆయన నడక వేగం హెచ్చించి "రాజయ్యా" అని కేకవేశారు. అంతమంది జనంలో ఆ కేక వినపడలేదో ఏమో రాజయ్య ముందుకు

అడుగు వేశాడు. రంగనాథం మరి కాస్త వేగం హెచ్చించి జనాన్ని తప్పించుకుంటూ మళ్లీ కేక వేశారు. ఈసారి అతను తిరిగిచూసి తనను కాదన్నట్లుగా ముందుకు నడవసాగాడు. రంగనాథంగారిలో పట్టుదల హెచ్చింది. త్వరత్వరగా నడిచి అతన్ని జేరి బుజంమీద చేయి వేసి "రాజయ్యా" అన్నారు రొప్పుతూ.

అతను వెనక్కు తిరిగి "మీరా పంతులుగారూ ?" అన్నాడు.

"ఇందాకట్నుంచీ గొంతు నెప్పెట్టేలా అరిచాను .... ఏమయిపోయావు యిన్నాళ్లనుంచీ ?" అన్నారు రంగనాథం అతడు తనను గుర్తించి మాట్లాడుతున్నాడు గదా అని స్థిమితపడి.

"ఈ వూళ్లోనే ఉంటున్నాను" అన్నా డతను.

"ఏం చేస్తున్నావు ?"

"పెద్ద సెంటర్లో కిళ్లీకొట్టు పెట్టాను."

"బాగా సాగుతోందా ?"

"భగవంతుడి దయవల్ల యింతదాకా సక్రమంగానే సాగుతోంది."

రంగనాథం వొక్క క్షణం ఆగి "నా బాకీ మాట ఏంజేశావు ?" అన్నారు మంద్రస్వరంలో.

అతను మాట్లాడలేదు.

ఆయన మరీ కాస్త గట్టిగా "ఏం చేశావు రాజయ్యా నా బాకీ సంగతి ?" అన్నారు.

అతను అర్థం కానట్లుగా "బాకీయా ?" అన్నాడు.

రంగనాథంగారు తెల్లబోయినా తమాయించుకుని "అవును రాజయ్యా ! నువ్వు తీసుకున్న మూడు వందలూను" అన్నారు.

"మూడు వందలా ? నేను తీసుకున్నానా ?!"

"అదేవిటి రాజయ్యా అలా మాట్లాడతావు ? ఆరోజు రాత్రి తొమ్మిది గంటలవేళ వొచ్చి బ్రతిమలాడలేదూ ?"

"ఇది మరీ బావుంది. మిమ్మల్ని నే నెందుకు బ్రతిమ లాడతాను ?"

"అబద్ధాలాడకు. బిడ్డా పాపా కలవాడివి."

"అతిగా మాట్లాడకండి. నేను మీకు బాకీ ఉన్నట్టు రుజువేమిటి ?"

నిర్ఘాంతపోయారు రంగనాథం. కళ్లవెంట నీరు తిరిగి నంత పనయిం దాయనకి. కాళ్లావేళ్లా పడితే జాలిదలిచి నోటు మరుసటిరోజు రాయించవచ్చు గదాని యిచ్చాడు తాను అంత సొమ్ము. ఇవ్వు డితడు .... ఆయనలో కసీ బాధా విజృంభిం చాయి. నవనాడులూ కూడ గట్టుకుని "ఇంత అన్యాయం చేస్తావా ? నా ఉసురు నీకు తగలదూ ?" అన్నారు.

"నోరు సంబాళించుకొని మరీ మాట్లాడండి. మీ ఉసురు నాకు తగల్డమేమిటి ?" అన్నా డతను కోపంగా.

రంగనాథంగారి కోపం కట్లు తెంచుకుంది. "నోరు మూయ్ ! పశువా !" అన్నారు తారస్థాయిలో.

"నువ్వే నోరు మూసుకో ! నోటి కొచ్చినట్టు పేలితే మర్యాద దక్కదు."

"ఏంచేస్తావురా ? దౌర్భాగ్యుడా"

"ఏమిట్రా కూశావ్ ?"

ఆ పోట్లాట చూసి అప్పటికే గుమికూడిన యాత్రి కులు రాజయ్య రంగనాథంగారి మీద చేయి చేసుకోబోవడం చూసి "వూరుకోండి" అన్నారు. ఒక యువకుడు రాజయ్యకు అడ్డంవెళ్లి "వూరుకోండి. పెద్దవాడిమీద దౌర్జన్యం దేనికి ?" అన్నాడు. రాజయ్య బుసలు కొడుతూ "మీరు అడ్డం రాక పోతే వీడి అంతం చూద్దు నివాళ. ఛీ !" అంటూ వెళ్లి పోయాడు అవతలికి. ఆ సన్నివేశం అంతవరకూ వస్తుందని వూహించని రంగనాథం దు:ఖంతో బాధతో "నాకు మూడు వందలు బాకీ బాబూ ? అడిగితే తంతానంటున్నానంటున్నాడు" అన్నారు దీనంగా. ఒకరిద్దరు ఆయన్ని వోదార్చి "ఏంచేస్తారు? అలాంటివాడికి అప్పు యివ్వటం మొదట మీ తప్పు" అంటూ ఆయన్ను అరుగుమీద కూచోబెట్టి వెళ్లిపోయారు. చిత్రం చూస్తున్నట్టు నిలబడిన జనం మెలమెల్లగా వెళ్లిపోసాగారు.

రంగనాథంగారి నయనాలనుండి అశ్రువులు స్రవిం చాయి. పై పంచెతో కళ్లద్దుకుని బుట్టలో కొబ్బరిచిప్ప అందుకున్నారు. ముక్క కొట్టి నోట్లో పెట్టుకోబోతూ ఎదురుగా నడిచిపోతున్న యువకుల్ని చూసి ఆగారు. వారిద్దరూ యిందాక నదీ స్నానానికి వచ్చినవారే. అందులో ఒకతను "ఈ ముసలాళ్లకి దైవభక్తి వో వంకరా భాయ్ ! ఆలయానికి వొచ్చినా అప్పులాళ్ల గొడవలే" అంటూ నడిచిపోతున్నాడు. అతన్ననుసరిస్తున్న రెండో అతను క్రీగంట రంగనాథంగారి వంక చూసి కిసుక్కున నవ్వాడు.

అంత దుఃఖంలోనూ రంగనాథంగారికి వాళ్లమీద కోపం కలిగింది. తన బాధ వీళ్లకేం తెలుస్తుంది ? అను కొంటూ కొబ్బరిముక్క నోట్లో పెట్టుకోబోయారు.

కుళ్లిన కొబ్బరి వాసన 'గుప్' మని కొట్టింది ఆయన నాసికకు.